క్లుప్తంగా...

డిప్యూటీ మేయర్‌కు ఆహ్వానం



డిప్యూటీ మేయర్ దంపతులను ఆహ్వానిస్తున్న అర్చకులు

లాలాపేట: సికింద్రాబాద్‌లో వచ్చే ఆదివారం జరుగనున్న ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు రావాలంటూ ఆలయ ప్రధాన అర్చకులు, కమిటీ సభ్యులు జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డిని ఆహ్వానించారు. గురువారం తార్నాకలోని ఆమె కార్యాలయంలో ఆలయ అర్చక, కమిటీ సభ్యులు డిప్యూటీ మేయర్ దంపతులను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

హుండీల ఆదాయం లెక్కింపు

అమీర్‌పేట: అమీర్‌పేట హనుమాన్ దేవాలయంలోని హుండీలను గురువారం లెక్కించారు. 105 రోజుల వ్యవధి కలిగిన 10 హుండీల ద్వారా రూ.6, 81,814 ఆదాయం వచ్చిందని ఆలయ అధికారి ఎం.విఠలయ్య తెలిపారు. లెక్కింపులో ధర్మకర్తలు సత్యనారాయణయాదవ్, రాజేశ్వరీ, భాస్కర్ గుప్తా పాల్గొన్నారు.

ఘనంగా జూనోసిస్ డే



వ్యాక్సిన్ వేసిన డాక్టర్ అయోధ్య

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బోయిగూడలోని పశువైద్యశాలలో గురువారం ప్రపంచ జూనోసిస్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున పెంపుడు జంతువులకు యాంటీరేబిస్ వ్యాక్సిన్ ఇచ్చారు. ఈ సందర్భంగా పశువైద్యశాల ప్రొఫెసర్ ఎస్. అయోధ్య మాట్లాడుతూ.. మనుషుల నుంచి జంతువులు, జంతువులను మనుషులకు సంక్రమించే వ్యాధులను జూనోసిస్ అంటారన్నారు. పెంపుడు జంతువులకు తప్పని సరిగా ప్రతీ ఏటా రేబిస్ వ్యాక్సిన్ ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జె. రాధాక్రిష్ణరావు, జీవన్‌జ్యోతి, మోహిత శ్రీ, పాల్గొన్నారు.

ఓయూలో గ్రాడ్యుయేషన్‌డే సందడి



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న ప్రొఫెసర్లు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డే-2023 సందడిగా జరిగింది. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొ. బీఎస్ మూర్తి ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభావంతులైన పలువురి విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, నగదు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ. రవీందర్, టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి. రఘుమారెడ్డి, ఓయూ రిజిస్ట్రార్ ప్రొ లక్ష్మీనారాయణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. శ్రీరామ్ వెంకటేష్ పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన జెడ్సీ



సికింద్రాబాద్: సికింద్రాబాద్ పరిధిలో అభివృద్ధి కార్యకలాపాలను పరుగులు పెట్టించాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్ జోనల్ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎస్. రవికిరణ్ గురువారం పద్మారావుగౌడ్‌ను ఆయన నివాసంలో కలువగా ఆయనను అభినందించారు.

జెడ్సీని కలిసిన కార్పొరేటర్లు



సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రవి కిరణ్‌ను సికింద్రాబాద్‌లోని ఆయన కార్యాలయంలో గురువారం సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ దశరథ్‌ను కలిసిన కార్పొరేటర్ హేమ ఎన్నికల నిర్వహణ, నూతన పోలింగ్ బూత్‌ల ఏర్పాట్లు, పాత పోలింగ్ బూత్ కేంద్రాల మార్పులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ, నేతలు జలేందర్ రెడ్డి, రాజ సుందర్ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు స్ఫూర్తిదాయకం



జగ్జీవన్‌రామ్‌కు నివాళి అర్పిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు



బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు



నివాళి అర్పించిన వివిధ పార్టీల నేతలు

బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకలను గురువారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆయన సేవలను కొనియాడారు.

– సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



జగ్జీవన్ రామ్‌కు నివాళి అర్పిస్తున్న మన్నె క్రిశాంక్



విగ్రహానికి నివాళి అర్పించిన హేమలత



బన్సీలాల్‌పేట్ జబ్బార్ కాంప్లెక్స్ వద్ద..

మాలల యుద్ధభేరిని జయప్రదం చేయాలి

అడ్డగుట్ట: రాష్ట్రంలోని మాలలు, మాల అనుబంధ కులాల హక్కుల సాధన కోసం మాల ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆగస్టు 13న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాలల యుద్ధబేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. రెండో విడత దళిత బంధులో మాలలకు 50 శాతం వాటా తగ్గకుండా ఇవ్వాలన్నారు. హైదరాబాద్‌లో మాల సామాజిక భవనం ఏర్పాటు చేయాలని, డబుల్ బెడ్రూమ్, గృహలక్ష్మి లాంటి పథకాలలో మాలలకు సరైన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కొన్ని పోలీస్‌స్టేషన్లలో పేద దళితులకు న్యాయం జరగడం లేదని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీల మాలలకు 12 సీట్లకు తగ్గకుండా కేటాయించాలని, మాల ప్రజా సంఘాల జేఏసీ అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కరణం కిషన్, గోపోజు రమేష్, మంచాల లింగస్వామి, మన్నె శ్రీధర్, ఇందిరా, అంజలి, రామలీల, ఇంద్రన్న, పుష్పలత, రామాంజనేయులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న పాండుయాదవ్

వైభవంగా విగ్రహ పునః ప్రతిష్ట

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఆరో వార్డు నందమూరి నగర్ లోని పోచమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల నడుము అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా పాండు యాదవ్ మాట్లాడుతూ.. గతంలో బస్తీలో ఆలయం ఇరుకుగా ఉండేదని తాను ప్రత్యేక చొరవ తీసుకొని ఆలయ విస్తీర్ణాన్ని పెంచామన్నారు. తాజాగా అమ్మవారి విగ్రహాన్ని సైతం పునఃప్రతిష్టించడం జరిగిందని, ఇది బస్తీ ప్రజలకు శుభసూచకం అన్నారు. తాను బోర్డు సభ్యుడిగా ఉన్న రోజుల్లో బస్తీలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ఉమాకాంత్, నరేష్, రాజేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభం



పవర్‌బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న లాస్య నందిత, నివేదిత

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం రసూల్‌పురా ఇండియన్ ఎయిర్‌లైన్స్ గేట్ వద్ద నియోజకవర్గ అభివద్ధి నిధులతో పవర్‌బోర్‌వెల్ పనులను లాస్య నందిత, నివేదిత గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పేద ప్రజల నీటి కష్టాలు తీర్చేందుకు తమ తండ్రి సాయన్న కృషి చేశారని పవర్‌బోర్ వెల్స్ వేసి సింటెక్స్ ట్యాంకులు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివద్ధి నిధులతో మంజూరైన వివిధ పనులను దశలవారీగా చేపడుతున్నామని చెప్పారు. పార్టీలకతీతంగా పలువురు నాయకులు తమను ఆదరిస్తున్నారని వారికి ధన్యవాదాలన్నారు. ఈ కార్యక్రమంలో సదా కేశవరెడ్డి, శ్రీనివాస్, కుమార్, నర్సింహ శామ్‌రెడ్డి, ప్రకాష్, తార్వేజ్, గౌస్ అస్లాం, యూనుస్ పాల్గొన్నారు.

ముగిసిన సైనికాధికారుల రీసెర్చ్ మెథడాలజీ శిక్షణ



ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట సైనిక అధికారులతో ప్రొఫెసర్లు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో మాస్టర్స్ చదువుతున్న సైనిక అధికారులకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న హయ్యర్ ఎయిర్ కమాండ్ కోర్సులో భాగంగా ఈ నెల 3 నుంచి కొనసాగుతున్న రీసెర్చ్ మెథడాలజీ క్యాప్సూల్స్-2023 శిక్షణ గురువారం ముగిసింది. ఓయూ ఆర్ట్స్ కళాశాల రాజనీతి శాస్త్రం విభాగం సెమినార్ హాల్లో జరిగిన ఈ ముగింపు కార్యక్రమంలో వైమానిక, సైన్యం, నేవీ తదితర రంగాలకు చెందిన సుమారు 43 మంది అధికారులు పాల్గొన్నారు. వారి పరిశోధన అనుభవాలను ఓయూ ప్రొఫెసర్ల సమక్షంలో వివరించారు. నాణ్యమైన పరిశోధనలపై దృష్టి పెడుతూనే దేశ సరిహద్దుల రక్షణలో సంయుక్త బలగాల కృషిని ఈ సందర్భంగా పలువురు ఓయూ ప్రొఫెసర్లు కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్లు గణేష్, స్టివెన్‌సన్, చంద్రు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో జనాభాకు అనుగుణంగా మంచినీటి, డ్రైనేజీ పైపులైన్ పనులను ఆధునీకరించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి, సివరేజ్ సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసే మంచినీటి పైపులైన్ ఏర్పాటుతో శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గురువారం కవాడిగూడ డివిజన్‌లోని పూల్‌బాగ్‌లోని హైదరాబాద్ స్టడీ సర్కిల్ సమీపంలో రూ.25 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసే మంచినీటి పైపులైన్ పనులకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ జి.రచనశ్రీలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పూల్‌బాగ్‌లో నూతనంగా ఏర్పాటు చేసే మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులు రాబోయే 20 రోజుల్లో పూర్తి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, బీజేపీ రాష్ట్ర నాయకులు పరిమళ్‌కుమార్, జి.వెంకటేష్ పాల్గొన్నారు.

సివిల్స్ పరీక్ష అభ్యర్థులకు 9న ఉచిత వర్క్‌షాప్

చిక్కడపల్లి: డాక్టర్ ఎస్ శ్రీధర్స్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈనెల 9న ఉచిత వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని అకాడమీ డైరెక్టర్ నాగ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అశోక్‌నగర్‌లోని అకాడమీలో ఆదివారం జరిగే ఈ వర్క్‌షాప్‌లో ప్రముఖ విద్యావేత్త, పోటీ పరీక్షనిపుణులైన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత గణేశ్, ఇతర నిపుణులు పాల్గొంటారని తెలిపారు. వివరాల కోసం 8374938606 నెంబరుకు ఫోన్ చేయవచ్చన్నారు.

8,9 తేదీల్లో ఉచిత వివాహ పరిచయ వేదిక

కాచిగూడ: ఈ నెల 8,9 తేదీల్లో ఉచిత వివాహ పరిచయ వేదికను సికింద్రాబాద్ లోని అమృత వాణి కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఎస్.అబ్రహం తెలిపారు. ఆసక్తి గల వివిధ కులాల వధూవరుల తల్లిదండ్రులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 8885410555, 8885073555 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కవాడిగూడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికీ వివరించి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ మండడి అంజన్‌కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. ముషీరాబాద్ నియోజకవర్గం కవాడిగూడ డివిజన్ పార్టీ నూతన అధ్యక్షుడుగా నియమితులైన పోతరాజు భాస్కర్ గురువారం మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అరాచక పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుంటూ అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో కొత్త డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ముషీరాబాద్ ఏ-బ్లాక్ అధ్యక్షులు వీడీ కృష్ణ, కాంగ్రెస్ నగర నాయకులు పి.లక్ష్మణ్, మద్దెల ప్రభాకర్ పాల్గొన్నారు.

మతిస్థిమితం సరిగాలేని వ్యక్తి అదృశ్యం



శ్రీనివాస్

బౌద్ధనగర్: మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్సై వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. ముషీరాబాద్‌లోని బాపూజీ నగర్‌కు చెందిన శ్రీనివాస్(44)కు మతిస్థిమితం సరిగాలేని కారణంగా ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ నెల 5న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన శ్రీనివాస్ ఎంతకీ రాకపోవడంతో గురువారం శ్రీనివాస్ సోదరి చంద్రకళ వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది.

యువకుడి అదృశ్యం



అయ్యుబ్

బౌద్ధనగర్: పనికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పార్శీగుట్ట అశోక్‌నగర్‌కు చెందిన అయ్యుబ్ ఖరేషి(24) ఆటో డ్రైవర్. ఈ నెల 3న ఉదయం పనికి వెళ్తున్నానని చెప్పి ఆటో తీసుకుని వెళ్లిన అయ్యుబ్ రాత్రైనా ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బోనాల జాతర పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ హేమ

చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ నల్ల పోచమ్మ బోనాల జాతర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అధికారులను ఆదేశించారు. కట్టమైసమ్మ ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో గురువారం ఆమె పర్యటించి అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ నెల 16,17 తేదీల్లో జరిగే చిలకలగూడ బోనాల జాతరకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. కట్టమైసమ్మ ఆలయ సమీపంలో పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. ఆలయ రంగులు, విద్యుత్‌దీపాల అలంకరణ తదితర పనులకు టెండరు ప్రక్రియ పూర్తయిందన్నారు. ఆలయం ఎదురుగా గల చిలకలగూడ మున్సిపల్ మైదానంలో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన..

సీతాఫల్‌మండి డివిజన్ కిందిబస్తీలో రూ. 18 లక్షల వ్యయంతో చేపట్టిన సివరేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి కార్పొరేటర్ సామల హేమ పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కోరారు. చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్, ప్రధాన అర్చకులు తిరుమలాచార్యులు, జలమండలి డీజీఎం కృష్ణ, సెక్షన్ మేనేజర్ అన్విత్, నాయకులు మురళీ, సాయియాదవ్ పాల్గొన్నారు.

కోర్టు వివాదంలో ఉండే స్థలంలో పనులు ఎలా ప్రారంభిస్తారు.?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మర్రి

సనత్‌నగర్: ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో కోర్టు వివాదంలో ఉన్న స్థలం స్వాధీనం చేసుకోకుండానే ఖబ్రస్తాన్‌ను ఎలా ప్రారంభించారని బీజేపీ నాయకుడు మర్రి శశిధర్‌రెడ్డి ప్రశ్నించారు. బేగంపేటలోని ఆయన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శిలాఫలాకంపై రూ.295 లక్షల ప్రాజెక్టు వ్యయం చూపించారని రూ.235 లక్షలకే టెండర్ వేయడం అనుమానాలకు దారి తీస్తుందన్నారు. టెండరు లాంచనాలు పూర్తి చేయకుండా, హడావిడిగా పనులు ప్రారంభించడం స్థానికులను తప్పుదోవ పట్టించడమే అన్నారు. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ పనిచేసినట్లు అనిపిస్తుందన్నారు. ఈ సమావేశంలో షేక్ గౌస్, అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ ప్రతిపాదిత స్థల పరిశీలన



కమ్యూనిటీహాల్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అడ్డగుట్ట: శాస్త్రినగర్‌లో వృత్తి విద్యా భవన్ కోసం స్థానికుల అభ్యర్థన మేరకు గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. అడ్డగుట్ట డివిజన్‌లోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం భవనాల పక్కన ఉన్న ఖాళీ స్థలంలో వృత్తి విద్యా భవన్ ఏర్పాటు కోసం కమ్యూనిటీహాల్ నిర్మించాలంటూ స్థానికులు అనేక మార్లు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను కలిసి విన్నవించుకున్నారు. ఈ మేరకు గురువారం జీహెచ్‌ఎంసీ ఏఈ వేణు వచ్చి సదరు స్థలాన్ని పరిశీలించారు. కమ్యూనిటీహాలు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించామని, మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రవీణ మహిళ సంఘం అధ్యక్షురాలు ఎన్. శోభ, నాగరాణి, గంధమాల జ్యోతి, లక్ష్మి, రాధిక ఉన్నారు.

నేచురల్స్ శిక్షణ అకాడమీ ప్రారంభం



నేచురల్స్ శిక్షణ అకాడమీ నిర్వాహకులతో జ్యోతిరెడ్డి

అమీర్‌పేట: మైత్రివనమ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన నేచురల్స్ శిక్షణ అకాడమీని కీ సాఫ్టవేర్ సొల్యూషన్స్ సీఈఓ, జ్యోతిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.సెలూన్ల నెట్‌వర్క్‌కు సంబంధించిన అన్ని రకాల కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు హమీదా రసూల్ తెలిపారు.మాస్టర్స్ డిప్లొమా, ప్రొఫెషనల్ డిప్లొమా సర్టిఫికెట్ కోర్సులతో పాటు అధునాతన నెయిల్ ఆర్ట్, సెల్ఫ్ గ్రూమింగ్, మెహందీ బేసిక్, అడ్వాన్స్డ్, మేకప్‌లో ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. నేటి ఆధునిక యుగంలో బ్యూటీ, వెల్నెస్ పరిశ్రమ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎండీ గులాం రసూల్, జనరల్ మేనేజర్ అబ్దుల్ రవూఫ్ పాల్గొన్నారు.

జీఓ 58 ప్రకారం ఇళ్ల పట్టాలివ్వాలి

కవాడిగూడ: ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు జీవో 58 ప్రకారం ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. ప్రతి ప్రకటన జీవోగా భావించాలని, వాగ్దానాలను అమలు చేసినప్పుడే ప్రజలకు విశ్వాసం కలుగుతుందని, మాట తప్పితే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని వారు హెచ్చరించారు. ప్రభుత్వ, భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో 1432 మురికివాడలు ఉన్నాయని, మరో 450 వరకు ఉంటాయని, అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పుతున్న ప్రభుత్వం మురికివాడలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను, దళితులకు మూడు ఎకరాల భూమిని, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్ బోస్, పశ్య పద్మ, ఎన్.బాలమల్లేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

గొంతుకోసుకుని వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: అప్పుల బాధ తాళలేక గొంతుకోసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడిపల్లికి చెందిన మల్లయ్య (51) ఆటో డ్రైవర్, 15 ఏళ్ల క్రితం మల్లయ్య తన కూతురి వివాహం చేశాడు. ఈ క్రమంలో అప్పులు అవ్వడంతో కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మనస్తాపానికి గురై జూన్ 22న ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఘట్‌కేసర్ వద్ద యానంపేట్ బ్రిడ్ దగ్గర రైలు పట్టాల పక్కన గొంతు కోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మల్లయ్యను మేడిపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం 26న కింగ్ కోటిలోని కామినేని ఆస్పత్రికి ఈ నెల 3న నార్కెట్‌పల్లిలోని కిమ్స్ ఆస్పత్రిలోలో చేర్పించగా చికిత్స పొందుతూ ఈ నెల 5న మృతి చెందినట్లు తెలిపారు.

రియల్ ఎస్టేట్‌లో నష్టం రావడంతో..

అమీర్‌పేట: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టం రావడంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం.. అమీర్‌పేట ఎస్‌ఆర్‌నగర్‌లోని రాయల్ రెసిడెన్సీ ఫ్లాట్ నెం.301లో గుంటూరు సుబ్రహ్మణ్య ప్రసన్న (54) భార్య నీలిమా, కుమారుడితో కలిసి ఉంటున్నాడు. గత కొంతకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న ప్రసన్న వ్యాపారం చేసేందుకు తెలిసిన స్నేహితుల వద్ద అప్పులు తీసుకున్నాడు. వ్యాపారంలో నష్టం రావడం, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని స్నేహితులు అడుగుతుండటంతో మనస్తాపానికి గురయ్యాడు. జూలై 4న బాత్రూమ్ క్లీన్‌చేసే డొమెక్స్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వాంతులు చేసుకోవడంతో చికిత్స నిమిత్తం అమీర్‌పేటలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

బతుకుదెరువు కోసం వచ్చి...

మెట్రో పోలీస్ హోటల్‌పై నుంచి పడి యువకుడి దుర్మరణం

రాంగోపాల్‌పేట్: ప్రమాదవశాత్తు హోటల్ భవనంపై నుంచి కిందపడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జగిత్యాల మెట్‌పల్లికి చెందిన సాయికుమార్ యువకుడు సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయం ఎదురుగా ఉండే మెట్రో పోలీస్ హోటల్‌లో రూమ్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన అతని స్నేహితుడు పడిగెల రాజు (22) సాయి కుమార్‌కు ఫోన్ చేసి తనకు ఉద్యోగం చూడాలని కోరాడు. అతడి సూచన మేరకు రాజు ఈ నెల 5న రాత్రి నగరానికి వచ్చాడు. అదే రోజు రాత్రి ఇద్దరు కలిసి మద్యం సేవించేందుకు హోటల్ 8వ అంతస్తు టెర్రస్‌పైకి వెళ్లారు. టెర్రస్‌పై మెట్ల మార్గం పక్కనే పై నుంచి కింది వరకు ఖాళీగా ఉంది. దాని పైన హోటల్ నిర్వాహకులు ప్లాస్టిక్ షీట్‌తో కప్పి ఉంచారు. ఈ విషయం తెలియని రాజు దానిపై కాలు పెట్టడంతో భవనం మైన్-2లో పడిపోయాడు. హోటల్ సిబ్బంది అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.